(హాస్య గల్పిక)

# 'వర్ణ' సంకరమా, వర్ధిల్లుమా!

-అవసరాల రామకృష్ణా రావు.

కాకినాడకి చెందిన సత్యం కరీంనగర్‌కి చెందిన యాదగిరి కలసి చదువుకున్నారు. యాదగిరి చెల్లెలికి పెళ్లయితే సత్యం వాళ్ళూరు వెళ్ళాడు. పెళ్ళితంతు జరుగుతున్న ఒకానొక సందర్భంలో పెళ్ళిపెద్ద ఉన్నట్టుండి 'చప్పుడు చెయ్యండి, చప్పుడు చెయ్యండి' అంటూంటే అది విన్న సత్యానికి ఏ మాత్రమూ అర్థం కాలేదు. ఎవరు, ఎందుకు, ఎలా చప్పుడు చెయ్యాలిట? ఇంతలో బాజాలు మ్రోగాయి. అ మాటక యాదగిరి ద్వారా అర్థం తెలుసుకున్న సత్యానికి ఉన్న మతి కాస్తా ఊడిపోయినట్టయ్యింది. ఆ ప్రాంతపు తెలంగాణా పరిభాషలో 'చప్పుడు చెయ్యండి' అంటే బాజాలు వాయించండి' అని అర్థమట!

సెలవులకి సత్యంతో కాకినాడ వచ్చిన యాదగిరికీ ఓసారి ఇలాంటి ఇబ్బందే ఎదురైంది. సత్యమూ వాళ్ళమ్మ ఆవిడ కోడలుతో ఏంచెబుతుందో అది చెవిన పడ్డ యాదగిరికి తలాతోకా అనలేదు. ఆవిడ అన్నదిదీః "అవి ఇలా తెమ్మని ఎన్నిసార్లు చెప్పినా వినవేం? గిల్లుకుందామంటే ఓ పట్టాన రావేం?"

యాదగిరి ఆశ్చర్యంగా కిటికీలోంచి చూశాడు. కోడలు చేటలో చిక్కుడు కాయలు తెస్తోంది. 'అవి' అంటే చిక్కుడు కాయలన్న మాట. మరి గిల్లుకోడం ఏమిటి? అవి ఓ వైపున పెట్టుకుని అత్తాకోడలూ ఒకర్నొకరు గిల్లుకుంటారా ఏం?

సత్యం ద్వారా ఆ మాండలికానికి అర్థం తెలుసుకున్న యాదగిరికి నవ్వాగలేదు. కూర చేసుకోడానికి గాను చిక్కుడు కాయల్ని ఈనెలు తీసేసి చిన్న చిన్న ముక్కలుగా చేసుకుంటారే, ఆ క్రియకి గోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో గిల్లుకోవడం అంటారట!

భాష ఎంత పెంకిది!

ఈ రెండు సంఘటనలూ కలిపి చెబుతూ అందుకే మా రామ్మూర్తితో నేను అంటానూ.

రామ్మూర్తీ, మన రాష్ట్రంలోని రెండు ప్రాంతాల్లోని పలుకుబళ్ళలోనే ఇంత తేడా ఉంటే ఇంకో భాషలోని పోకళ్ళని మనమేం తప్పు పట్టగలం చెప్పు?'

అంతటితో అవునని ఒప్పుకుంటే రామ్మూర్తి గొప్పదనం ఏముంది? మన పొరుగు రాష్ట్రం భాష మీద దండయాత్ర ప్రారంభించాడు - మన భాషలో 'స్టౌమీద బియ్యం పడెయ్యి' అంటామే, దానికి సమానంగా ఆ భాషలో 'స్టౌ మీద అన్నం కూచో బెట్టు' అన్నట్టు ఉంటుందిట. ఈ కూచోబెట్టడం' అనే క్రియ ఇతర సందర్భాల్లోనూ ఎక్కువగా వాడుతారట. చల్లదనానికి గిన్నెలో నెయ్యి పేరుకుపోతే, 'అబ్బ, నెయ్యి చతికిలపడిపోయింది కాబోలు' అన్నట్టు మాట్లాడతారట' 'ఈ కూచో బెట్టడం ఏమిటి చెప్పు' అని ఒకటే నవ్వు.

తెలిసీ తెలియని ఈ వేళాకోళం నాకు రుచించక అక్కడితో ఆపు చెయ్యాలని మరోవైపు దృష్టి మళ్ళించాను.

'అది సరేగాని ఉత్తరాది భాషల్లో 'రీటాఫల్' అనే పదం ఉంది, విన్నావా?'

'వినకేం? మన 'కుంకుడు కాయలు'కి కదూ వాళ్ళలా అంటారు?'

'నిజమే. ఒకటడుగుతాను చెప్పు. ఫల్ అంటే పళ్లు కదా, మరి కాయలు అనడం ఏం సబబు? వాళ్ళదో మనదో ఎవరిదో ఒకరిదే రైటయి ఉండాలి. ఎవరిదంటావ్?'

'వాళ్ళదేనేమో!'

'అలా దారికిరా. నిజం చెప్పవలసివస్తే బాగా పండిన వాటినే మనం కోయించుకుంటున్నాం. వాటిలోనే బాగా కుంకుడు రసం వస్తుంది. అయినా మనం పళ్లు అనం. మన భాషలో ఏదైనా పండుతుంది గాని కుంకుడు కాయ మాత్రం పండదు'

'అంటే?' అన్నాడు మా రామ్మూర్తి వెర్రి మొహం వేసి.

'అలా అడుగు చెబ్తాను. చెప్పేముందు మరికొన్ని సంగతులు వివరిస్తాను. మడీ మైలా లాంటి అంటరాని తనాలు మనకే గాని మన భాషలకి లేవు. ఆడుకునే మాటలకి తప్ప అవి ఏ వ్యాకరణ సూత్రాలకీ లొంగవు. భాష అనేది సర్వ స్వతంత్ర నిత్య నూతన ప్రియ. శాస్త్రోక్తంగా దాన్ని బిగించాలని చూస్తే అదే నిన్ను వేళాకోళం చేసి తిప్పికొట్టక మానదు'

'ఏదో పండడం గురించి చెబుతానన్నావ్?'

'అదే వస్తున్నాను. మనం 'పండడం' అనే క్రియని ఎన్ని రకాలుగా ఉపయోగిస్తున్నామో చూడు. కల పండుతోంది. కడుపు పండుతోంది. నోరు పండుతోంది. నోము పండుతోంది. జుత్తు పండుతోంది. ఆఖరికి పాపం కూడా పండుతోంది. తెలుగు భాషలో ఏదైనా పండుతోంది, ఒక్క కుంకుడు కాయ తప్ప!'

తెలుగంటే వెర్రి అభిమానం రామ్మూర్తికి. నేనిలా అల్లరి పెట్టడం నచ్చినట్టు లేదు. అతన్ని తెలుగులో రాసిన ఓ పోస్టరు ఆకర్షించి, రక్షించినట్టుంది. దాని మీద పెద్ద పెద్ద అక్షరాలతో 'అఖిల భారత ఫుట్‌బాల్ క్రీడ' అని రాసుంది. 'చూశావా! ఇంగ్లీష్‌లో తప్ప ఏదీ రాసుకోని మన వాళ్ళో కూడా ఇప్పుడిప్పుడు తెలుగు ఉపయోగిస్తున్నారు. ఎక్కడికక్కడ సంతోషించాలి మరి!' అన్నాడు. నేనా ఊరుకోనేది!

'చూసి చూసి అంత అల్పా సంతోషులం కావడం అనవసరం. నువ్వు చూపించిన పోస్టర్లో ఒక్కటుంటే ఒక్కటి అచ్చ తెలుగు ముక్క లేదు! అలా తెల్లబోకు, అంతర్జాతీయ భాష ఇంగ్లీషుకే అది తప్పలేదు. అయినా అదేం విచారించవలసిన విషయం కాదు. ఇతర భాషల ఊటలు ఎంత దింపుకుంటే అంతగా ఏ భాషయినా సుసంపన్న మవుతుంది. మాటవరసకి ఓ వాక్యం చెబుతా, జాగ్రత్తగా విను.'

నేను రామ్మూర్తికి చెప్పిన ఇంగ్లీషు వాక్యం ఇదీ.

**Our boss drank coffee and met on the verandah the tabacco merchant with a mammoth umbrella.** ఈ ఇంగ్లీష్ వాక్యంలో ఎన్ని పరభాషా పదాలున్నాయో కూడా వివరించాను. **Boss** అనేది **Dutch** పదం. వరండా పోర్చుగీసు భాష. టొబాకో ఇండియన్ మాట. మేమత్ రష్యన్ పదం. అంబ్రెల్లా ఇటాలియన్.

మావాడు కాస్సేపు నోరెళ్ళ బెట్టి "అవునవును. ఇంగ్లీషు వాళ్ళు మన తెలుగు ముక్క కూడా ఒకటి కొట్టేశారటగా! బాండీకూట్ అనే ఇంగ్లీషు మాట మూలం మన 'పందికొక్క'ట కదా!"

"నిజమే సుమా! ప్రపంచంలో ఎక్కడ ఏమూల పందికొక్కు కనబడినా అది మన భాష పుణ్యమే!"

రామ్మూర్తి నవ్వకుండా ఉండలేకపోయాడు. దానితో చిన్న చురక కూడా. 'ఏదైనా మన వాళ్ళని కించపరిచే నీ చమత్కారం నాకేం హితవుగా లేదు సుమా!' అనేశాడు.

'కించపరచడం కాదు. మన లోపాలు తెలుసుకునే మనోధైర్యం ఉంటేనే మన భాష మాధుర్యం, సౌందర్యం మనం అందుకో గలిగేది. ఇంతకీ ప్రజల తీర్పే ఎంత గొప్ప భాష మనుగడకైనా జీవధాతువు. 'పదుగురాడు మాట పాటియై ధరజెల్లు' అనే వేమన పలుకు కన్నా గొప్ప భాషా సూక్తి ఉండదు. ఈ ముచ్చటకి ముక్తాయింపుగా రెండు ఉదాహరణలిస్తాను. 'పరిష్కారమ్' అనే సంస్కృత పదం ఉంది. అడ్డదిడ్డంగా ఉన్న సామాన్లని సర్ది గదిని శుభ్రం చెయ్యడమని దాని అర్థం. తెలుగులో ఎలా వాడుతున్నాం? అదే 'పరిష్కారం' అనే మాటని. సమస్యకి సమాధానంగా కలహానికి తీర్పుగా ఉపయోగించుకుంటున్నాం. ఇక మాటని పలకడం విషయమో? 'హాస్పిటల్' అనే ఫ్రెంచి పదాన్ని మనం ఉచ్చరించే తీరు? అదేదో ఆకూ పత్రీ అయినట్టు ఆసుపత్రి అనేస్తున్నాం. ఏ భాష అయినా ఇంతే. ఆ అల్లరి గమనిస్తే అడుగడుగునా హాస్యవల్లరి!

* * *